క్లుప్తంగా

నేటి నుంచి జాతర

ఓజిలి: మండలంలోని ఆర్మేనిపాడు గ్రామంలో శ్రీముంగమూరి పరమేశ్వరీ అమ్మవారి జాతర ఉత్సవాలను మూడు రోజులపాటు ఘనంగా నిర్వహిస్తున్నట్లు దేవాలయ కమిటీ సభ్యుడు శోభన్‌బాబు గురువారం తెలిపారు. అమ్మవారి జాతరలో గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు పాల్గొని, విజయవంతం చేయాలని ఆయన కోరారు.

తేనెటీగల దాడిలో 8మందికి గాయాలు

కోట: కోట మెయిన్‌రోడ్డు మార్గంలో బజాజ్ షోరూం సమీపాన బుధవారం తేనెటీగలు దాడి చేయడంతో పలువురు భయంతో పరుగులు తీశారు. ఓ చెట్టుకు తేనెపట్టు ఉండగా వీచిన గాలులకు మరో కొమ్మ తేనెపట్టుపై పడడంతో తేనెటీగలు చెలరేగాయి. రోడ్డుపై వెళ్తున్న వాహనదారులను చుట్టుముట్టి దాడి చేశాయి. 8 మందిపై తేనెటీగలు దాడి చేయగా వారిలో ఇద్దరు కోట ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందారు.

ప్రాథమిక దశలో గుర్తిస్తే క్యాన్సర్ నివారణ

బాలయపల్లి(సైదాపురం): ప్రాథమిక దశలోనే గుర్తిస్తే క్యాన్సర్ నివారణ సాధ్యమవుతుందని బాలాయపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి లియోనా తెలిపారు. తిరుపతి శ్రీవెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) ఆధ్వర్యంలో గురువారం మండంలోని నిండలి, గొట్టికాడు గ్రామాల్లో పింక్ బస్సు ద్వారా ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించారు. వైద్యులు డాక్టర్ హరిత, డాక్టర్ చైతన్యభాను, స్టాఫ్‌నర్స్ కృష్ణయ్య, సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు

చిల్లకూరు: నిత్యావసర సరుకులు పంపిణీ చేసే సమయంలో రేషన్ డీలర్లు అందుబాటులో లేకపోయినా, అవకతవకలకు పాల్పడినా చర్యలు తప్పవని తహశీల్దార్ శ్రీనివాసులు హెచ్చరించారు. మండల రెవెన్యూ కార్యాలయంలో గురువారం ఆయన మండలంలోని అన్ని రేషన్ దుకాణాల డీలర్లతో సమీక్ష నిర్వహించారు. కార్డుదారులకు అసౌకర్యం కలిగించేలా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్ఐ పూర్ణ, సీఎస్‌డీటీ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలకు విద్యార్థుల ఎంపిక


గురుకుల పాఠశాలకు ఎంపికైన కలువాయి విద్యార్థులు

కలువాయి(సైదాపురం): మండల కేంద్రమైన కలువాయికి చెందిన ఆరుగురు విద్యార్థులు మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలకు ప్రవేశ పరీక్షల్లో విజయం సాధించారు. నూటేటి లక్ష్మి, జాహ్నవి, మోడి బోయిన రాజ హంసిక, ఈగ శివ దేవిక, సత్తు ప్రేమ్‌కుమార్ కౌశిక్, యోగేంద్ర జిల్లాలో వివిధ గురుకుల పాఠశాలలకు ఎంపికయ్యారని వారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ చేపట్టాలి

కలువాయి(సైదాపురం): కలువాయి మండలం చింతలపాళెం ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్ గురువారం కడపలో జరిగే మహానాడుకు బహిరంగంగా ఉపాధి కూలీలు, గ్రామస్తులను బస్సు ఎక్కించారు. దీనిపై కలువాయి మండల బీజేపీ నాయకుడు దండు పెంచలయ్య(డీపీ) అసహనం వ్యక్తం చేశారు. అధికారం ఉందని అడ్డంగా నడవకూడదని, ఉపాధి హామీ ఏపీఓ సునీల్‌పై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ వ్యవహారంపై బీజేపీ నాయకుడు దండు పెంచలయ్య సోషల్ మీడియాలో సైతం పోస్టులు చేశారు.

సీఐకు సమ్మె నోటీసు అందజేత


సీఐకు సమ్మె నోటీసు అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు

వెంకటగిరి రూరల్: ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సమ్మెకు సంబంధించిన నోటీసులు కార్మికులు గురువారం వెంకటగిరి సీఐ ఏవీ రమణకు అందజేశారు. ఆ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు వేధింపులకు గురి చేయడంపై వెంకటగిరి సీఐ దృష్టికి తీసుకొచ్చినట్లు తెలియజేశారు. కార్మికులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలు 6వ తేదీలోగా సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే 7వ తేదీ నుండి నిరవధిక సమ్మె బాట పట్టనున్నట్లు తెలియజేశారు.

బస్టాండ్ ఆధునికీకరణకు చర్యలు


బస్టాండ్‌ను పరిశీలిస్తున్న ఆర్టీసీ అధికారులు

వెంకటగిరి (సైదాపురం): పట్టణంలోని ఆర్టీసీ డిపోను ఆధునికీకరించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు విజయవాడకు చెందిన ఏపీఎస్ ఆర్టీసీ చీఫ్ సివిల్ ఇంజినీర్ వెంకటరమణ పేర్కొన్నారు. పట్టణంలోని స్థానిక ఆర్టీసీ బస్టాండును గురువారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఏపీఎస్ ఆర్టీసీ వీసీ, ఎండీ ఆదేశాల మేరకు బస్టాండ్‌లను ఆధునికీకరించనున్నట్లు తెలియజేశారు. తిరుపతి డిప్యూటీ ఈఈ చెన్నకేశవరావు, డిపో మేనేజర్ రామకృష్ణ, ఏఈ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇంటింటికీ సేవలకు చెల్లు

కూటమి పాలన మొదలైన తరువాత ప్రజల వద్దకే పాలన కనుమరుగైంది. ప్రతి ప్రభుత్వ పనికి ప్రజలు పరుగులు పెట్టించే స్థితికి తీసుకుని వచ్చారు. వైఎస్‌ఆర్ సీపీ ప్రభుత్వ హయాంలో వృద్ధులు, దివ్యాంగులు, మంచానికే పరిమితమైన వారు, చేనేతలు, వితంతువులు ఇలా ఎవరికైనా ప్రతి నెలా పింఛన్ ఒకటో తేదీన ఉదయం నిద్ర లేచే సరికే ఇంటి ముంగిటకు వచ్చి వలంటీర్లు అందించే వారు. నేడు ఆ పరిస్థితి కనుమరుగైంది. వలంటీర్ వ్యవస్థను తొలగించి సచివాలయం అధికారులు పింఛన్‌దారులను ఒక చోటకు రమ్మని నగదు అందిస్తున్నారు. వలంటీర్ల స్థానంలో సచివాలయ ఉద్యోగులను ఉపయోగించుకుని వారి స్థాయిని తగ్గించుకుని పని చేయాల్సి వస్తుందనే ఆవేదన చెందేలా చేస్తోంది.

– చిల్లకూరు

- నాడు ప్రతి సేవా ఇంటి వద్దకే ...
- నేడు పరుగులు పెట్టాల్సిందే..


పింఛన్ కోసం ఎదురు చూస్తున్న లబ్ధిదారులు

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి అవుతుండగా ఇప్పటి వరకు ఒక్క కొత్త పింఛన్ కూడా అందించలేదు. అలాగే రేషన్ కార్డులకు కనీసం దరఖాస్తు చేసుకోమని చెప్పారే తప్ప ఎప్పుడు అందిస్తారో తెలియడం లేదు. అధికారులను అడిగితే ఇది నిరంతర ప్రక్రియ అని చెబుతున్నారు. అయితే పలు రకాల కొర్రీలు పెట్టి కొత్తగా పెళ్లి చేసుకున్నవారు రిజిస్ట్రేషణ సర్టిఫికెట్, పెళ్లి కార్డులు దరఖాస్తుతోపాటుగా అందించాలని నిబంధనలు పెడుతున్నారు. పింఛన్‌దారులకు ఇక చుక్కలు చూపిస్తున్నారు. గతంలో పింఛన్ పొందుతూ ఇంటి పెద్ద మృతి చెందితే ఆ స్థానంలో భార్యకు పింఛన్ ఇచ్చేవారు. దీనికి కూడా ఇప్పటి వరకు అతీగతి లేదు. ఇక వృద్ధులుగా నమోదు చేసుకోవాలంటే ఇందుకు సంబంధించిన సైట్ ఓపెన్ కావడం లేదు. అంటే పింఛన్లు కొత్తవి ఇచ్చేది లేదని అని చెప్పకనే చెబుతున్నారు. దీంతో ఎంతో మంది తమకు కూటమి నాయకుల సిఫారసుల కోసం పాకులాడాలని ఆందోళన చెందుతున్నారు.

ఇంటి వద్దకే రేషన్ ఇక హుళక్కే..

పేదలకు ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందించేలా ఎండీయూ వాహనాలను ఏర్పాటు చేశారు. ప్రతి నెలా మొదటి పది రోజుల్లో సరుకులు అందించేలా చర్యలు చేపట్టారు. దీంతో కూలి పనులకు వెళ్లేవారు సైతం తమ ఇంటి వద్దకే సరుకులు వస్తుండడంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందుకున్నారు. నేడు కూటమి ప్రభుత్వంలో ఎండీయూ వాహనాలను రద్దు చేసింది. జూన్ ఒకటో తేదీ నుంచి ఇక రేషన్ డీలర్ల వద్దకే వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సిందేనని ఆదేశాలు జారీ చేశారు. అందుకు తగ్గ ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పేదలు ఇకపై తమకు రేషన్ కష్టాలు తప్పవని నిర్ధారించుకుంటున్నారు. రేషన్ కార్డులు కూడా కొత్తవి ఇప్పటి వరకు ఇవ్వకపోవడంతో సరుకులు కూడా అంతంత మాత్రమే అందే పరిస్థితి ఏర్పడింది.

నియోజకవర్గం వారిగా వివరాలు:

సూళ్లూరుపేట నియోజకవర్గంలో..	
మున్సిపాల్టీలు :	3
మండలాలు:	6
పంచాయతీలు :	128
పింఛన్లు :	45,863
మొత్తం జనాభా :	3,18,042
గూడూరు నియోజకవర్గంలో..	
మున్సిపాల్టీ :	1
మండలాలు :	5
పంచాయతీలు :	122
పింఛన్లు :	33,099
మొత్తం జనాభా :	3,02843
వెంకటగిరి నియోజకవర్గంలో..	
మున్సిపాల్టీ :	1
మండలాలు :	6
పంచాయతీలు :	147
పింఛన్లు :	41,716

ఇంటికి వచ్చి ఇచ్చేవారు



ప్రభుత్వం అందించే పింఛన్ గతంలో వలంటీర్లు వేకువ జామున నిద్ర పోతుండగానే తలుపు తట్టి అందించేవారు. అయితే ఏడాది నుంచి పింఛన్‌ను సచివాలయం అధికారులు ఒక చోటకు వచ్చి అక్కడికే అందరినీ పిలిపించి అందిస్తున్నారు. ఒక్కో సమయంలో వేలి ముద్రలు పడడం లేదని గంటల కొద్దీ వేచి ఉండాల్సి వస్తుంది. ఇంటి వద్దకే పింఛన్ అందించేలా చూడాలి. కరోనా సమయంలో కూడా వలంటీర్లు ఇంటి వద్దకు వచ్చి నగదు అందించి, ఏదైనా అవసరాలు ఉంటే కనుక్కొని మందులు, కూరగాయలు తెచ్చి ఇచ్చే వారు. నేడు అలాంటి పరిస్థితి లేదు. – జయమ్మ, ఏరూరు, చిల్లకూరు మండలం

పింఛన్ అందడం లేదు



నా భర్త పింఛన్ పొందుతూ అనారోగ్యంతో మరణించి రెండు సంవత్సరాలు అవుతున్నా ఇప్పటికీ పింఛన్ అందడం లేదు. నా భర్త దోర్నాదుల రమణయ్య డయాలసిస్ పెన్షన్ పొందుతూ 2023 జూన్ మాసంలో మరణించాడు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పింఛన్ అందించాలని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా. ప్రభుత్వం 2023 డిసెంబర్ మాసంలో మరణించిన పింఛన్‌దారుల భార్యలకు పింఛన్ అందిస్తామని ప్రకటించింది. గతంలో పింఛన్ పొందుతూ మరణించిన భార్యలకు ప్రభుత్వ పింఛన్ అందించాలి. – దోర్నాదుల రాజమ్మ, రాపూరు

పాతరోజులు గుర్తుకు వస్తున్నాయి



గతంలో రేషన్ షాపుల్లో బియ్యం తెచ్చుకునేందుకు గంటల తరబడి క్యూలైన్లలో నిల్చుకునే పరిస్థితి ఉండేది. వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం తీసుకుని వచ్చిన ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి గడప వద్దకే బియ్యం సరుకులు అందజేశారు. నేడు ఆ వాహనాలను తొలగిస్తూ ప్రస్తుత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కారణంగా నేడు మళ్లీ పాత రోజులు గుర్తుకు వస్తున్నట్లుగా ఉన్నాయి. మళ్లీ రేషన్ షాపుల వద్ద పడిగాపులు తప్పవు.

– గుంటమడుగు గీతాంజలి, ఆర్‌వైజీపాళెం, సైదాపురం మండలం

రేషన్ కార్డు కోసం పడిగాపులు



కొత్త రేషన్ కార్డు కోసం నిత్యం కార్యాలయాలు చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. పెళ్లై ఏళ్లు గడుస్తున్నా మా కుటుంబం నుంచి వేరుగా రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నా. ఆన్‌లైన్‌లో మాత్రం గడ ఏడాది నుంచి పేరు మాత్రం చూపుతుంది. కానీ కొత్త రేషన్ కార్డు నేటికీ అందడం లేదు. గ్రామ సచివాలయం చుట్టూ ఐదు రోజులుగా తిరుగేతున్నా అయినా ఫలితం లేకుండా పోతుంది. అధికారులు కనికరించి కొత్త రేషన్ కార్డు ఇస్తే చాలు. – అంబటి వెంకటేశ్వర్లు, దాడిశెట్టిపల్లి, సైదాపురం మండలం

స్పష్టత లేని పాలన



కూటమి ఏడాది పాలనలో స్పష్టత లేదు. పింఛన్లు మాత్రం ఇచ్చామని టీడీపీవారు ప్రచారం చేసుకుంటున్నారు. నేతల హడావిడి ఎక్కువగా ఉంది. గతంలో వలంటీర్లు ద్వారా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు ఇంటి వద్దకే అందేవి. ఇప్పుడు వలంటీర్ వ్యవస్థ రద్దుతో ప్రతి ఒక్క పనికీ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. వలంటీర్లు ఉన్నప్పుడు ప్రభుత్వం నుంచి ఏమి కావాలన్నా గడప దగ్గరకే వచ్చి అందించే వారు. పథకాల అమలులో తీవ్ర జాప్యం చేస్తున్నారు. – జి.శివకుమార్, అనంతమడుగు, సైదాపురం మండలం

గంగ నీరు చెరువులకు చేరేనా?


యాకసిరి చెరువులోకి 7వ బ్రాంచి కాలువ నుంచి నెమ్మదిగా ప్రవహిస్తున్న నీరు

చిట్టమూరు: తెలుగుగంగ నీరు 7వ బ్రాంచి కెనాల్ ద్వారాసాగు నీరు గురువారం చిట్టమూరు మండలంలోకి ప్రవేశించాయి. రాంభొట్లపల్లి నుంచి తెలుగు గంగ 7వ బ్రాంచి కాలువ ద్వారా నాయుడుపేట మండలం పుదూరు గ్రామ సరిహద్దుల నుంచి మండల పరిధిలోని చెంగాళమ్మ మాను వద్ద ఉన్న కాలువలోకి నీటి ప్రవాహం చేరుకుంది. అయితే ఈ ప్రవాహం నెమ్మదిగా రావడంతో మండలంలో ఉన్న చెరువులకు ఎప్పుడు చేరుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. రోజుకు 300 క్యూసెక్కుల నీరు వదలాల్సి ఉండగా కేవలం 120 క్యూసెక్కుల నీరు మాత్రమే వదులుతున్నట్లు రైతులు పేర్కొన్నారు. తమిళనాడుకు ఎక్కువ శాతం నీరు వదలడంతో స్వర్ణముఖి నదిలోకి నీరు తక్కువగా వస్తోంది. చిట్టమూరు మండలంలో మొదటి యాకసిరి చెరువుకు నీరు చేరుతుంది. తర్వాత గొలుసుకట్టు చెరువులైన గొట్టిప్రోలు, అద్దేపూడి, జంగాలపల్లి, ఈశ్వరవాక, తిమ్మారెడ్డివాగు, ఎల్లసిరి, కోగిలి, మల్లాం చెరువులకు తెలుగుగంగ నీరు పారాల్సి ఉంది. అయితే అధికారులు స్పందించి తమకు పూర్తి స్థాయిలో తెలుగుగంగ నీటిని విడుదల చేసి వరి పంటల సాగుకు ఇబ్బంది కలగకుండా చూడాల్సి ఉంది.

వీధిలైట్లు ఏర్పాటు

కోట: జరుగుమల్లి దళితవాడలో వీధిలైట్లు వెలగకపోవడంతో చీకట్లు అలముకున్నాయి. పంచాయతీ కార్యదర్శికి, పాలకవర్గం దృష్టికి సమస్యను తీసుకువెళ్లినా పట్టించుకోలేదు. స్థానిక వైఎస్ఆర్ సీపీ నాయకుడు ఉలస కస్తూరయ్యకు గ్రామస్తులు చెప్పడంతో వెంటనే స్పందించి తన సొంత నిధులు వెచ్చించి వీధిలైట్లు ఏర్పాటు చేశారు. దళిత కాలనీవాసులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కస్తూరయ్య మాట్లాడుతూ జరుగుమల్లిలో విద్యుత్ స్తంభాల కొరత ఉందన్నారు. కొన్ని చోట్ల విద్యుత్ స్తంభాలు పక్కకు ఒరిగిపోయి ఉన్నాయన్నారు. సంబంధిత అధికారులు స్పందించి ప్రజాసమస్యలను పరిష్కరించాలని కోరారు.

ఆర్టీసీ ప్రయాణికులకు ఇక్కట్లు


నాయుడుపేట బస్టాండ్‌లో మల్లాం బస్సు కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

కోట: ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సులు లేక పోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నాలుగు మండలాల నుంచి కోటకు నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఈ క్రమంలో వాకాడు డిపో బస్సులను టీడీపీ మహానాడుకు తరలించడంతో గ్రామీణ, మారుమూల ప్రాంతాలు, సుదూర ప్రాంతాలకు ప్రయాణం చేయడానికి ఆర్టీసీ బస్సుల కోసం గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. వాకాడు డిపోలో మొత్తం 39 సర్వీసులు ఉండగా 34 సర్వీసులను మహానాడుకు మళ్లించినట్లు అధికారులు తెలిపారు. అరకొర బస్సులతో జనం అవస్థలు పడ్డారు. గంటల తరబడి ఎదురు చూసి చివరకు ఆటోలు, ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు.


బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

చిట్టమూరులో..

చిట్టమూరు: కూటమి ప్రభుత్వం ప్రజా రవాణా వ్యవస్థను పార్టీ సేవలకు వాడేస్తుంది. కడపలో నిర్వహించిన మహానాడుకు ఆర్టీసీ బస్సులను వాడుకోవడంతో ప్రయాణికులు గురువారం ఆర్టీసీ బస్టాండ్‌ల వద్ద ఇబ్బందులు పడ్డారు. చిట్టమూరు మండలానికి కోట, నాయుడుపేట, సూళ్లూరుపేట పట్టణాల నుంచి ప్రజలు ప్రయాణాలు సాగిస్తుంటారు. అయితే సమయానికి బస్సులు రాకపోవడంతో బస్టాండుల్లో పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది.

జనాభిప్రాయం మేరకే మైనింగ్ అనుమతి

సైదాపురం: ప్రజల అభిప్రాయాల మేరకే మైనింగ్ లీజుకు అనుమతి మంజూరు చేస్తున్నట్లు నెల్లూరు ఆర్డీఓ నాగసంతోషి అనూష వెల్లడించారు. మండల కేంద్రమైన సైదాపురం సమీపంలోని గోకుల బృందావనం గ్రామ సమీపంలో గురువారం ధ్వని ప్రమోటర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో పర్యావరణంపై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొలకలపూండ్ల గ్రామంలోని 804–పీ, 806–పీ2లో 32.758 హెక్టార్లులో మైనింగ్ కార్యకలాపాలను నిర్వహించేందుకు పర్యావరణం అనుమతి కోసం ప్రజాభిప్రాయ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె చెప్పారు. మైనింగ్‌తో గ్రామానికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని గ్రామస్తులు స్పష్టం చేశారు. ప్రజలంతా మైనింగ్ పరిశ్రమ కావాలంటూ తెలియజేయడం ఎంతో శుభపరిణామమన్నారు. పర్యావరణ అధికారి అశోక్‌కుమార్, గని యజమాని షేక్ జాఫర్, తహశీల్దార్ రమాదేవి, సర్పంచ్ శారద, గ్రామ ఉపసర్పంచ్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతులు అప్రమత్తంగా ఉండాలి

సైదాపురం: మామిడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పొదలకూరు ఉద్యాన శాఖాధికారి ఆనంద్ కోరారు. మండలంలోని తిప్పిరెడ్డిపల్లి, చాగణంరాజుపాళెం గ్రామాల్లో ఉన్న మామిడి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం తేలికపాటి వర్షాలు కారణంగా పండు ఈగ ఉధృతి సమస్యగా మారిందన్నారు. ఈ సమస్యను పరిష్కరించే విధానాన్ని రైతులకు క్షేత్రస్థాయిలో వివరించారు. పండు ఈగలను నియంత్రించడానికి ఎకరాకు 6, 8 పండు ఈగ ఫెరోమోన్ ఉచ్చులను ఉంచాలని కోరారు. ఎర్ర ఉచ్చులను కూడా అక్కడ అక్కడ ఏర్పాటు చేసుకోవాలన్నారు.



పసుపు రంగు పండు ఈగ ఉచ్చు, రైతుకు అవగాహన కల్పిస్తున్న ఆనంద్

తప్పని ఆధార్ కష్టాలు

వెంకటగిరి రూరల్: మండల పరిషత్ కార్యాలయ భవనంలో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్లలో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. ఆధార్ సవరణల కేంద్రం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేయడంతో వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో చేరుకుని ఆధార్ సవరణలు చేసుకుంటున్నారు. ఇందులో సర్వర్ సమస్యలు స్వల్పంగా తలెత్తడం, ప్రజలు అధికంగా రావడంతో గంటల తరబడి ప్రజలు పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఆధార్ సవరణ సెంటర్లను సంఖ్య పెంచి ప్రజలకు వెసులుబాటు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.


ఆధార్ సవరణలకు గుంపులుగా ఉన్న ప్రజలు

యోగాతో ఆరోగ్యకర జీవనం


అత్తివరంలో యోగాలో శిక్షణ ఇస్తున్న ట్రైనర్

ఓజిలి: ఆరోగ్యవంతమైన జీవనానికి యోగా ఎంతో అవసరమని ఎంపీడీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని అత్తివరం సచివాలయంలో యోగాంధ్రలో భాగంగా సచివాలయ, ఆరోగ్య సిబ్బందికి మూడో రోజు శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరు యోగాంధ్రాలో పేర్లు నమోదు చేసుకునేలా గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. వచ్చే నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

చెట్లు నరికివేతపై ఆందోళన

చిల్లకూరు: ప్రభుత్వ భూమిలో తాము సాగు చేసుకుంటున్న జామాయిల్ చెట్లను అన్యాయంగా నరికి వేయడంతో పూర్తిగా నష్టపోయామని నెలబల్లిరెట్టపల్లికి చెందిన దళితులు తిరుపతయ్య, పరుశురామయ్య ప్రజా సంఘాల నాయకులతో కలసి తహశీల్దార్‌కు వినతి పత్రం అందించారు. మండల రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ శ్రీనివాసులును కలుసుకున్న వారు మాట్లాడుతూ మండలంలోని నెలబల్లిరెట్టపల్లి గ్రామం సర్వే నెంబర్‌లోని 244, 245లలో ఐదెకరాల భూమిని పదేళ్లుగా సాగు చేసుకుంటున్నామని అన్నారు. ఇందులో భాగంగానే మూడేళ్ల క్రితం ఐదు ఎకరాలలో జామాయిల్ సాగు చేపట్టగా అవి ఏపుగా పెరిగాయని తెలిపారు. అయితే ఆ భూమి కన్నేసిన గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకుడు తమను బెదిరించి జామాయిల్ చెట్లను అక్రమంగా నరికి వేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తహశీల్దార్ స్పందిస్తూ పరిశీలించి న్యాయం చేస్తామని అన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి నిత్య అన్నదాన పథకానికి గురువారం దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, రాధారాణి దంపతులు రూ.50 వేలు విరాళంగా అందించినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. వారికి తీర్థ ప్రసాదాలు, వేద ఆశీర్వచనాలు అందించారు.

రేషన్ పంపిణీలో సమయపాలన పాటించాలి

ఓజిలి: రేషన్ లబ్ధిదారులకు సరుకుల పంపిణీ విషయంలో డీలర్లు సమయపాలన పాటించాలని సివిల్‌సప్‌లెస్ డీటీ గోపిరెడ్డి అన్నారు. మండల రెవెన్యూ కార్యాలయంలో డీలర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఎండీయూ వాహనాలను రద్దు చేసి డీలర్లుకు పూర్తిస్థాయిలో సరుకుల పంపిణీకి అనుమతులు మంజూరు చేశారన్నారు. డీలర్లు వద్ద ఉన్న తూకాలు, సాఫ్ట్‌వేర్ అప్‌డేట్, సరుకుల పంపిణీలో పలు సూచనలు, సలహాలను అందించారు. సరుకుల పంపిణీలో నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈయన వెంట డీటీ మధుసూదన్‌రాజు తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న సివిల్‌సప్లయిస్ డీటీ గోపిరెడ్డి

రేషన్ దుకాణాల్లోనే నిత్యావసరాల పంపిణీ

కోట: జూన్ 1 నుంచి రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసరాలను పంపిణీ చేస్తున్నట్లు తహశీల్దార్ జయజయరావు తెలిపారు. ప్రతి కార్డుదారుడికి రేషన్ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. గురువారం రేషన్ డీలర్లతో తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ప్రజలు పాతపద్ధతిలోనే చౌకదుకాణాల వద్దకు వెళ్లి రేషన్ తీసుకోవాలని సూచించారు. ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు రేషన్ పంపిణీ చేయాలన్నారు. రేషన్ పంపిణీలో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. డీటీ మల్లికార్జున్ పాల్గొన్నారు.

నదిలోకి దూసుకెళ్లిన ఆటో



ఆటోను వెలుపలకి తీస్తున్న ఆటో డ్రైవర్లు

వెంకటగిరి రూరల్: ఆటో అదుపుతప్పి నదిలోకి దూసుకెళ్లింది. పట్టణంలోని కై వల్యా నది వద్ద గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన సాయి కై వల్యా నది ఒడ్డున ఆటో తిప్పుకుంటుండగా ఆటో అదుపుతప్పి ఒక్కసారిగా నదిలోని డ్రైనేజీ కాలువలోకి దూసుకెళ్లింది గమనించిన డ్రైవర్ సాయి అప్రమత్తమై ఆటో నుండి దూకేశాడు. ప్రయాణికులు ఉండిఉండే పెను ప్రమాదం జరిగేదని, త్రుటిలో ప్రమాదం తప్పింది. పట్టణంలోని కాశీపేట– నుండి కైవల్యానది బ్రిడ్జిపైకి వెళ్లే దారిలో నది వద్ద రక్షణ గోడ లేకుండా ప్రమాదకరంగా ఉంది. అధికారులు స్పందించి కై వల్యానది ఒడ్డున రక్షణ గోడ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.


రక్షణ గోడలు లేకుండా ప్రమాదకరంగా ఉన్న రోడ్డు

వైభవంగా గంధోత్సవం


ఉరుసు వేడుకల్లో భాగంగా జెండాలతో ఊరేగింపు

నాయుడుపేట టౌన్: పట్టణంలోని హజరత్ ఖాదర్‌షావలీ(చిన్నదర్గా) 41వ గంధోత్సవ(ఉరుసు) వేడుకలను గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. దర్గాను పూలతో అందంగా అలంకరించారు. గడియారం సెంటర్ నుంచి దర్గా వరకు విద్యుత్ దీపాలంకరణతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. రాత్రి దర్గా సమీపంలో ఉన్న నీలిశెట్టి కుటుంబ సభ్యులు, పఠాన్ అమీర్‌ఖాన్ ఇళ్ల వద్ద నుంచి జెండాలతో పురవీధుల్లో ఊరేగించి, దర్గా వద్దకు తీసుకొచ్చి ప్రతిష్ఠించారు. పట్టణంలోని కాలేషా సాహెబ్ ఇంటి వద్ద నుంచి ఆయన కుమారులు చాన్‌బాషా, శేఖర్ శ్రీవారి గంధాన్ని ప్రత్యేకంగా అలంకరించిన రథం(గుమ్మటం)పై పెట్టుకుని నగరోత్సవాన్ని జరిపారు.